క్లుప్తంగా

కోడి పందేల బరులు ధ్వంసం



బుల్‌డోజర్‌తో బరులు ధ్వంసం చేయిస్తున్న ఎస్‌ఐ చిన్నబాబు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అనుమతులు లేకుండా కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్న బరులపై దాడి చేసినట్లు ఎస్‌ఐ చిన్నబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలోని మామిడి తోటల్లో కోడి పందేల బరులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం రావటంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామని తెలిపారు. బారికేడ్‌ల కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలను బుల్‌డోజర్‌లతో ధ్వంసం చేశామన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోడి పందేల నియంత్రణకు చర్యలు

వీరులపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడి పందేలు, జూదం అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసాంఘిక క్రీడల నిర్వహణను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 94407 96458కు సమాచారం అందించాలని సూచించారు.

బంగారం, వెండి నగలు అప్పగింత



నగలను సరిచూస్తున్న ఈఓలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో భక్తులు కానుకగా సమర్పించిన వెండి, బంగారు నగలను గతంలో పనిచేసి ప్రస్తుతం అన్నవరం ఆలయ ఈఓగా పనిచేస్తున్న మూర్తి, నూతనంగా అమ్మవారి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన జీవీడీఎన్ లీలాకుమార్‌కు శుక్రవారం అప్పగించారు. ఆలయ ఆవరణలో సీసీ కెమెరాలు, హోంగార్డులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో ఈఓలు నగలను సరిచూశారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఆలయ అధికారులకు విరాళం అందజేస్తున్న దాతలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన తొండూరి వీరనాగభూషణం, తిరుపతమ్మ దంపతులు రూ.15,116 విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పేదలకు నూతన వస్త్రాల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని విలియంపేటలో శుక్రవారం రాత్రి నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, నియోజకవర్గ యువజన నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ విలియంపేటలో డప్పు కళాకారుల పెన్షన్లు గతంలో 80 ఉండగా, నేడు 150 కి పైగా పెరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వేల్పుల రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్ రోశయ్య, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, విలియంపేట నాయకులు ఉప్పెల్లి పెంటయ్య, ప్రసన్న, చెరుకుమల్లి రాంబాబు, మల్లెల సాయి, మారేపల్లి నాగేంద్రం, ఉప్పెల్లి ప్రసాద్, ఉప్పెలి అఖిల్ పాల్గొన్నారు.

హామీలిస్తాం.. నెరవేరుస్తాం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా హామీలిచ్చి విస్మరించమని, ఇచ్చిన హామీలను నెరవేర్చటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్‌ల పెంపు వారోత్సవాలలో భాగంగా మండలానికి నూతనంగా మంజూరైన 273 పింఛన్‌లను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్‌లు ఇస్తున్న రాష్ట్రం మనదేనని తెలిపారు. గత మూడున్నరేళ్లలో అన్ని రకాల పింఛన్‌లకు రూ.62,500 కోట్లు వెచ్చించి ప్రతి నెలా ఒకటో తేదీన తలుపు తట్టి వలంటీర్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు పింఛన్‌ను కూడా పెంచి అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇష్టారీతిన ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. చంద్రబాబు సభల పేరుతో ప్రచారం కోసం ప్రజలను బలి తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీకి ఓటు వేస్తే ఆ ఓటుకు విలువ ఉండదని, భూస్వాములకు ఉపయోగమని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తూ చట్ట సభలలో సైతం ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలాజీకుమార్, కౌన్సిల్ సభ్యుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పార్లమెంటరీ మహిళా కన్వీనర్ సంపత విజిత, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్‌లు చిలుకూరి శ్రీనివాసరావు, ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇజ్రాయిల్, జానకిరామయ్య, గోపి, పుల్లయ్య, పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్‌లు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేస్తున్న విప్, ఎమ్మెల్యే ఉదయభాను

ఠంచనుగా పింఛను అందిస్తున్న ఏకైక సీఎం జగన్



జుజ్జూరులో నూతన పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): లబ్ధిదారులకు ఠంచనుగా పింఛను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామ సచివాలయంలో వైఎస్సార్ పెన్షన్ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరిగా పెన్షన్ తీసుకునే అవ్వాతాతలను ఇబ్బందులు పెట్టకుండా నేరుగా వారి ఇంటి వద్దే వలంటీర్‌ల ద్వారా పింఛన్‌లు అందిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్‌తో కలిపి రూ.2,750 ఈ నెల నుంచి అందించామని తెలిపారు. మండలంలో ఇప్పటికే 9125 పింఛన్‌లను అందిస్తున్నామని, కొత్తగా 276 పెన్షన్‌లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్‌లు మారపాక మహాలక్ష్మి, షోడగిరి రాజశ్రీ, ఎంపీడీవో అరుంధతీ దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు కోటేరు సూర్యనారాయణ రెడ్డి, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, శీలం రమణారెడ్డి, తోట నారాయణరావు, రత్నప్రసాద్, తోట హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



నందిగామ రెండవ వార్డులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల చెరువుకట్ట గ్రామ సచివాలయం-1లోని 8 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడవరోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శమని అన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు పాలనను అత్యంత చేరువ చేసిన దార్శనికుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, అనేక రాష్ట్రాలు ఈ వ్యవస్థలను వారి రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయని, ఇది మన రాష్ట్రానికే గర్వ కారణమన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మన బడి నాడు నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు సైతం ఆర్థిక సాయం అందించడం, ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని, ప్రజలు ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్ బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు వైఎస్సార్ సీపీ నాయకులు కాలవ పెదబాబు, కాలవ వాసుదేవరావు, నంబూరు పెదబాబు, నారిశెట్టి శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, వంగా శ్రీనివాసరావు, దాసరి రాము, మాదుగుల శంకర్, శేషం వాసుబాబు, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమం

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో గడపగడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని రెండవ వార్డులో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వార్డులోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించటంతో పాటు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్ తానూరి రాము, కమిషనర్ జయరాం, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి వెంకటేశ్వరరావు, కర్రి రవీంద్రబాబు, పార్టీ కార్యకర్తలు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించాలి

ఎంపీడీఓ బాలశంకరరావు



ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలశంకరరావు

కంచికచర్ల: గ్రామాల్లో అర్హులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీఓ కె.బాలశంకరరావు అన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జీతాలకు ఆశించకుండా సేవకుల్లా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత గలవారిని గుర్తించి వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి వలంటీర్ తమ పరిధిలో ఉన్న ఇళ్లలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకుని అందేలా చూడాలన్నారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్థులకు అమ్మ ఒడి పథకం వంటి పథకాలు అన్నీ వర్తించేలా చేయాలన్నారు. ఇన్‌చార్జి డీవైఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని అధికారులతో చర్చించి పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.రాజకుమారి, డీటీ నాగుల్‌మీరా, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు

సిబ్బందికి కమిషనర్ ఆదేశం

నందిగామ: ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం సిబ్బందికి సూచించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో జగనన్న మోడల్ కాలనీలలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పురోగతిపై సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ విషయంలో సిబ్బంది అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి కాలనీలో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని, దానిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకటకృష్ణారెడ్డికి ముఖ్యమంత్రి సహాయన నిధి ద్వారా మంజూరైన రూ.1,00,000 చెక్కును లబ్ధిదారుని కుటుంబ సభ్యునికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, పోచంపల్లి మాజీ ఎంపీటీసీ బూతుకూరి మల్లేశ్వరరెడ్డి, నాయకులు నంబూరి రవి తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యునికి అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలి

నందిగామ: ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని డీవైఈఓ గౌరీశంకర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా డివిజన్ పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు, జీవో నంబర్ 117 ప్రకారం మంజూరైన పోస్టులు, అదనంగా ఉన్న ఉపాధ్యాయుల వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాది డివిజన్ పరిధిలో పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతోపాటు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకునేలా చూడాలన్నారు. ప్రతి పాఠశాల పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం తయారుచేసిన గణిత క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు నాయక్, డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



గణిత క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఈఓ గౌరీశంకర్

ఇది స్ట్రాంగ్ రూమా...స్టోర్ రూమా?

- ఆలయ సిబ్బందిపై ఈఓ ఆగ్రహం
- అమ్మవారి గాజులను భక్తులకు పంచాలని ఆదేశం

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని స్ట్రాంగ్ రూమ్‌ను సిబ్బంది స్టోర్ రూమ్‌గా మార్చారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన విలువైన వస్తువులు భద్ర పరిచేందుకు మండపంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది కార్తిక మాసంలో అమ్మవారికి గాజుల అలంకరణ చేసి వాటిని భక్తులకు పంచుతారు. అయితే సిబ్బంది గాజులను పంచకుండా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. అలాగే పనికి రాని పైపులు, ఇతర సామగ్రితో స్ట్రాంగ్ రూమ్‌ను నింపివేశారు. శుక్రవారం ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించగా గాజులు, ఇతర సామగ్రి ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం వాటిని తొలగించటంతో పాటు గాజులను భక్తులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆలయ సిబ్బంది తీరుపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన గాజులు

రేపు సంక్రాంతి ముగ్గుల పోటీలు

జగ్గయ్యపేట అర్బన్: హ్యూమన్ రైట్స్, జోషి అకాడమీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8 వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ వల్లాపు రపు వెంకటబాబు శుక్రవారం తెలిపారు. స్థానిక సీతారామపురం, డాక్టర్స్ రోడ్ మూడవ వీధిలో ఉన్న హ్యూమన్ రైట్స్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి ముగ్గుల పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తా

తప్పిపోయిన యువకుడి ఆచూకీ లభ్యం



గోపీచంద్‌తో శామ్యూల్, కుటుంబసభ్యులు

సాక్షి ఎఫెక్ట్

తోటచర్ల(పెనుగంచిప్రోలు): తప్పిపోయిన యువకుడి ఆచూకీ లభ్యమైంది. గ్రామానికి చెందిన కుక్కల గోపీచంద్(సన్నీ) డిసెంబర్ 7న విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై సాక్షి దినపత్రికలో ఈనెల 3న మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందన లభించింది. శుక్రవారం విస్సన్నపేటలో సన్నీ ఆచూకీ లభించటంతో సన్నీ బంధువులు, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నెమాల శామ్యూల్ వెళ్లి తీసుకువచ్చారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నందిగామ: సంప్రదాయ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎస్‌హెచ్‌ఓ కె.సతీష్ సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని జొన్నలగడ్డ గ్రామంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ తెలుగు వారికి అత్యంత ముఖ్యమైన పండుగైన సంక్రాంతి సందర్భంగా క్రీడా పోటీలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. పండుగల పేరుతో జూదాలు, కోడి పందేలు నిర్వహించకుండా ఇటువంటి ఆహ్లాదకరమైన టోర్నీలు నిర్వహించుకోవాలని సూచించారు. క్రీడల వల్ల శరీర దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

శివ ముక్కోటి పూజలు

జగ్గయ్యపేట అర్బన్: శివ ముక్కోటి సందర్భంగా పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న మఠం శివాలయంలో శుక్రవారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, 11 కేజీలతో అన్నాభిషేకం నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం, అనంతరం పాశుపత రుద్రహోమం ఘనంగా నిర్వహించారు.

అభివృద్ధి పథంలో పెండ్యాల గ్రామం

ఎంపీపీ మలక్‌బషీర్



పెండ్యాలలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్, అధికారులు

కంచికచర్ల: మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేస్తోందని, ఆ నిధులతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే రూ.1.60కోట్ల నిధులతో అన్ని గ్రామాల్లో సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు, తాగునీటి బోరు పంపులు వేయించామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కృషితో ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయించి అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పెండ్యాల గ్రామానికి మండల పరిషత్ నుంచి రూ.22లక్షల నిధులు మంజూరు చేయించి తాగునీటి బోరు పంపులు, సిమెంట్‌రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. తాము పండించిన పంట ఉత్పత్తులను ఇళ్లకు చేరవేసేందుకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని రైతులు తమ దృష్టికి తీసుకురాగా వెంటనే రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన కంప చెట్లను తొలగించి గ్రావెల్ రోడ్లు వేయించామన్నారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిబంధనల మేర పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడే హజరత్, నాయకులు పీర్‌సా మియా, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ

కంచికచర్ల: ప్రభుత్వం అర్హులందరినీ గుర్తించి పింఛన్లు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చేతులమీదుగా శనివారం పంపిణీ చేస్తామని, లబ్ధిదారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన అన్నారు.

నేడు కంచికచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం

కంచికచర్ల: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలోని 8వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారని, ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేయటంతో పాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ అరుణకుమార్



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాలలో భాగంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్‌గా తనను నియమించినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అరుణకుమార్‌ను సీఎం జగన్ అభినందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.